

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 26 జనవరి 2024



బి.కొత్తకోట మండలంలో గ్రామంలోనే ఉన్న కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ఓటును తొలగించిన దృశ్యం



సంబేపల్లె మండలంలో ఫొటో లేకుండా ఉన్న డబుల్ ఎంట్రీ ఓటు

అదే నిర్లక్ష్యం.. అవే తప్పులు..

- తప్పుల తడకగా తుది ఓటరు జాబితా
- చనిపోయిన వాళ్లకూ..ఓటు
- ఒకరికే రెండు, మూడు చోట్ల ఓట్లు
- స్పెషల్ డ్రైవ్‌లు ఏమైనట్లు.?
- తప్పుల్లేని ఓటరు జాబితా కలేనా?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంలో.. మార్పు లేదు.. ముందున్న తప్పుల్లోనూ.. మార్పు లేదు. ముసాయిదా ఓటరు జాబితాలోని తప్పుల తడకలోనూ.. మార్పు లేదు. ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితాలోనూ అవే తప్పులు ఉన్నాయి. 2022లో ప్రకటించిన ఓటరు జాబితాలో కుప్పలు కుప్పలుగా తప్పులు బయటపడ్డాయి. చనిపోయిన వాళ్లను ఓటరు జాబితాలో తొలగించకపోవడం, ఒకరికే రెండు మూడుచోట్ల ఓటు ఉండడం. జీరో డోర్ నెంబరుతో ఓట్లు వేలాదిగా ఉండడం.. ఒకే డోర్ నెంబరులో పెద్ద సంఖ్యలో ఓట్లు ఉండడం.. వంటి తప్పులు ఈ జాబితాలో చోటు చేసుకున్నాయి. దీనిపైన అధికార పార్టీ వేల సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు చేసుకుని, ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని ప్రతిపక్షాలు లెక్కకు మించి ఫిర్యాదులు చేశాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా బీఎల్‌వో నుంచి కలెక్టర్ స్థాయి వరకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. దాదాపు ప్రతి ఇంటికీ తిరిగి ఓటరుతో మాట్లాడారు. అధికారుల హడావుడి చూసిన వాళ్లు.. ఈసారి ఓటరు జాబితాలో కనీసం ఒకటి కూడా బోగస్ ఓటు ఉండదేమో అనుకున్నారు. ఓటరు జాబితాలో భూతద్దం పెట్టి వెతికినా.. తప్పులు బయటపడవు అనుకున్నారు. అయితే 2023 అక్టోబరులో ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాను చూసిన వాళ్లకు దిమ్మతిరిగి బొమ్మ కనపడింది. గతంలో ఉన్న తప్పులే అలాగే ఉన్నాయి. చనిపోయిన వాళ్ల ఓటును తొలగించలేదు. డబుల్ ఎంట్రీలూ అలాగే ఉన్నాయి. దీంతో ముసాయిదా ఓటరు జాబితాపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. సాక్షాత్తు ప్రతిపక్ష పార్టీ అధినేత చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా ఓటరు జాబితాలో అవకతవకలు, తప్పులపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. దీంతో తుది జాబితాలో ఈ తప్పులు పునరావృతం కాకుండా చూస్తామంటూ అధికారులు హడావుడి చేశారు. ఒకటికి మించి ఓటు కలిగి ఉన్న వ్యక్తులకు నోటీసులు పోస్టులో పంపించారు. ఎక్కడో ఒకచోటే ఓటు హక్కు ఉండేలా తేల్చుకోమని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదంతా చూసి హమ్మయ్యా.. తుది జాబితా అయినా తప్పులు లేకుండా వస్తుందని అందరూ ఊహించారు. అయితే ఇటీవల ప్రకటించిన ఓటరు తుది జాబితాను చూస్తే తప్పులు లేని ఓటరు జాబితా ఇక కలేనా..? అని అనుకోవాల్సి వస్తోంది. దీంతో తుది ఓటరు జాబితా నవ్వులపాలవుతోంది.. అవే తప్పులు మళ్లీ మళ్లీ వస్తుంటే.. అధికారుల నిర్లక్ష్యమే అనడానికి ఎటువంటి సందేహం లేదు. జిల్లా వ్యాప్తంగా తుది ఓటరు జాబితాలో తప్పులను ఒకసారి పరిశీలిస్తే..

ములకలచెరువులోని 17వ పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో 9 మంది చనిపోయిన వాళ్లు ఉన్నారు. గతంలోనే ఈ విషయమై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. అయినా ఆ ఓట్లు తొలగించలేదు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా ఫలితం శూన్యమని పలువురు పేర్కొంటున్నారు. 17వ పోలింగ్ కేంద్రంలోని వరుస సంఖ్య 122లో జి.వెంకటరమణ మృతి చెంది ఇప్పటికి మూడు సంవత్సరాలు దాటుతోంది. వరుస సంఖ్య 164 షుకూర్‌ఖాన్ చనిపోయి 15 నెలలు అవుతోంది వరుస సంఖ్య 198 ఆర్.ఇమామ్ సాబ్ చనిపోయి రెండు సంవత్సరాలు అవుతోంది. వరుస సంఖ్య 204 అబ్దుల్‌ఖాదర్ చనిపోయి రెండేళ్లకు పైగా అవుతోంది. వరుస సంఖ్య 264 హసన్‌వల్లి చనిపోయి మూడేళ్లు అవుతోంది. వరుస సంఖ్య 360 ఎ.వి.రత్నమయ్య చనిపోయి మూడు సంవత్సరాలు అవుతోంది. ములకలచెరువు పీటీఎం రోడ్డుకు చెందిన వరుస సంఖ్య 603 బీబీ బత్తుల్, వరుస సంఖ్య 604 హయత్ బీలు ఏడాది కిందట చనిపోయారు. (వీళ్లిద్దరూ అత్తా కోడళ్లు.) చనిపోయిన వీళ్లందరికీ తుది ఓటరు జాబితాలో అధికారులు చోటు కల్పించారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో సుమారు 500 మందికి పైగా చనిపోయిన వాళ్లు ఉన్నారు. వీటిని తొలగించాలని ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. అయినా అలాగే ఉన్నాయి. పెనగలూరు మండలంలో టీడీపీలో క్రియాశీలంగా ఉన్న బాలకృష్ణ ఓటును ఎస్‌వోఎస్ 1347822ను తొలగించారు. ఈయన గతంలో మండల టీడీపీ అధ్యక్షుడిగా.. ఒకసారి ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఇదే మండలంలో ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీ ఏజెంటుగా కూర్చునే టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు కొత్త పెద్ద కృష్ణయ్య ఓటు ఐఎంఐ 2205052ను కూడా తీసేశారు.

సంబేపల్లె మండలం ఎస్.సోమవరం పోలింగ్ స్టేషన్ 274, దేవళంపేటలో పోలింగ్ కేంద్రం 275లో డబుల్ ఎంట్రీలు, చనిపోయినవాళ్ల ఓట్లు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. బి.కొత్తకోట మండలంలో ఒక పల్లెకు చెందిన ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో లేవు. ఎక్కడ పడితే అక్కడకు మార్చేశారు. ఓటరు జాబితాలో ఫొటోలు లేకపోవడంతో ఓటర్లను కనుగొనడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె మండలం 162 పోలింగ్ కేంద్రం, పీటీఎం మండలం పులికల్లు గ్రామం పోలింగ్ కేంద్రం 114, 115లో ఆ గ్రామానికి సంబంధం లేని వారిని ముప్పాల నారాయణ, ముప్పాల వాణి, దాశెట్టి పావనిని ఓటరు జాబితాలో చేర్చారు. అదేవిధంగా సంబంధిత గ్రామానికి చెందిన పులికల్లు పంచాయతీ గుడ్డంపల్లెకు చెందిన పూజారి రేవతి, ఇదే గ్రామానికి చెందిన ఎన్. వెంకట్రమణ, మడుమూరు గణేష్ అనే ముగ్గురిని తొలగించారు. కలకడ మండలం నడిమిచెర్ల పోలింగ్ కేంద్రం 44లో వరుస సంఖ్య 825, 826లో నితిన్‌కుమార్‌రెడ్డి పేరు ఉంది. ఇదే గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో 45లో వరుససంఖ్య 891 పద్మాజా పేరు, ఫొటో ఉంది. వరుససంఖ్య 902లోనూ ఆమె వివరాలు కూడా ఉన్నాయి.

వాల్మీకీపురం పట్టణం 132వ పోలింగ్ కేంద్రంలో మహారాష్ట్రకు చెందిన ఓటరు పేరు హిందీలో ఉంది. వరుససంఖ్య 1055లో ఓటరు ఇక్కడ లేకుండా వేరే ప్రాంతానికి వెళ్లినా ఓటరు జాబితాలో ఆ పేరు అలాగే ఉంది. బజారువీధికి చెందిన ఓటర్లు గత పదేళ్ల క్రితం హైదరాబాదుకు వెళ్లారు. అక్కడే ఓటు హక్కు ఉన్నా వాల్మీకీపురంలో కూడా ఉంది. 132 పోలింగ్ కేంద్రంలో ఊర్లో లేని వాళ్ల పేర్లు ఓటరు జాబితాలో తొలగించలేదు. ఇటువంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ చూస్తే.. ఈ జన్మకు... తప్పుల్లేని ఓటరు జాబితా చూడడం సాధ్యం కాదేమో అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.





తంబళ్లపల్లె నియోజకవర్గం పీటీఎం మండలంలోని పులికల్లు పంచాయతీలో గ్రామంలో లేని ముప్పాల వాణి పేరుతో ఉన్న ఓటు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ప్రజలు

- అనుమతి ఉందని ఇసుక తరలించేందుకు పోలీసుల యత్నం
- గంటపాటు ఉద్రిక్త వాతావరణం



జేసీబీని చుట్టుముట్టిన గ్రామస్తులు

వీరబల్లి, జనవరి 25: మండల పరిధిలోని రాగిమానుదిన్నెపల్లె సమీపంలో ఉన్న మాండవ్యనది వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాగిమానుదిన్నెపల్లె సమీపంలో మాండవ్యనది నుంచి ఇసుకను తరలించేందుకు ఓ కంపెనీ ప్రతినిధులు ఎక్స్‌కవేటర్ సహాయంతో మాండవ్య నదిలోకి రహదారిని ఏర్పాటు చేస్తుండగా చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, రైతులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతం నుంచి ఇసుకను తరలించవద్దని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి వారికి అనుమతి ఉందని ఇసుకను తీసుకువెళ్లవచ్చని రైతులకు తెలిపారు. అంతేగాకుండా ఆయన దగ్గరుండి ఒక ట్రిప్పు ఇసుకను కూడా అక్కడి నుంచి తరలించారు. అనంతరం టీడీపీ మండల నాయకుడు శ్రీధర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, గ్రామ వైసీపీ సర్పంచ్ నాగిరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ అమర్‌నాథరెడ్డిలు అక్కడికి చేరుకుని రైతులకు మద్దతుగా నిలిచారు. ఇసుకను జగనన్న కాలనీలకు తరలిస్తున్నామని, తమకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మీకేమైనా ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి ఉంటే అవి చూపించాలని వారిని నాయకులు నిలదీయగా దీనికి కంపెనీ వారు ఎలాంటి ఆధారాలు చూపకుండా అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. మాండవ్య నది పొడవునా నదికి ఇరువైపులా తమ భూములు ఉన్నాయని నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే నీటిమట్టం తగ్గుతుందని రైతులు వాపోయారు.



రైతులను అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులు

ఊరి చుట్టూ ఊడ్చేస్తున్నారు..!

- ప్రభుత్వ భూములపై పెద్దల కన్ను
- ఫైళ్లలో సంతకాలు చేయాలని ఒత్తిడి
- బలి చేస్తారని రెవెన్యూ అధికారుల్లో భయం
- తప్పించుకుంటున్న అధికారులు



మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి పక్కనున్న వివాదాస్పద ప్రభుత్వ భూమి

మదనపల్లె, జనవరి 25: అధికార పార్టీ పెద్దల కన్ను ఊరు చుట్టూ ఉన్న విలువైన భూములపై పడింది. ప్రైవేటు భూములే కాదు..ప్రభుత్వ భూములపైనా పాగా వేస్తున్నారు. పెద్దల పేరుతో కొందరు దళారులు కొన్ని నెలలుగా పట్టణ శివారులోని భూములను జల్లెడ పడుతున్నారు. ముఖ్యంగా వివాదాస్పద, కోర్టు కేసుల్లోని భూములను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, అసలులో కొసరంత ఇచ్చి అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. తర్వాత పెద్దల పేరుతో ఆయా కార్యాలయాలలో తిష్ట వేస్తున్నారు. ఈ క్రమంలో నయానో, భయానో రెవెన్యూ అధికారులు, సిబ్బందిని తమ దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫైలు క్రతువు పూర్తయ్యాక తహసీల్దార్ కార్యాలయం, అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి నేరుగా జిల్లా కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. కలెక్టర్ ఎన్‌వోసీ జారీ చేసిన అనంతరం ఆ సర్వే నెంబరు ఆన్‌లైన్‌లో లేకపోతే, జేసీ లాగిన్‌లో అడిషన్ అనంతరం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. స్థూలంగా ఇక్కడ జరుగుతున్న ప్రక్రియ ఇదీ.

- మదనపల్లె శివారు ప్రాంతం బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-1-1ఏ7లోని 5.69 ఎకరాల విలువైన భూమి ఇది. ఈ భూమిని పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి 1956లో ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టా జారీ చేసింది. వివిధ కారణాలతో 2010లో దానిని రద్దు చేసి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. తర్వాత బాధితులు హైకోర్టుకు వెళ్లగా కోర్టులో కేసు నడుస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమిగానే ఉంది. ఇదిలా ఉండగా కొత్తగా వచ్చిన చట్టం మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ, అసైన్‌మెంట్‌లు 20 ఏళ్లు దాటితే పట్టా భూమిగా మార్చే ప్రక్రియ మొదలైంది. దీనిని ఆసరాగా తీసుకున్న అధికార పార్టీ నేతలు కొందరు.. అధికారుల సహకారంతో గతంలో రద్దు చేసిన డీకేటీ పట్టా భూమిని కూడా ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీహోల్డ్ స్కీమ్‌లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో బాధితులను ముందు పెట్టి రద్దు చేసిన అసైన్డ్ భూమిని తిరిగి యధావిధిగా (రీస్టోర్) రికార్డులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు రెవెన్యూ శాఖలో చర్చ నడుస్తోంది. ఇందులో భాగంగా తహసీల్దార్‌తో పాటు, ఆర్ఐ, వీఆర్వోపై ఒత్తిళ్లు మొదలైనట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నా.. దానిని ఆన్‌లైన్‌లో అమలులోకి తేకపోవడం వీరికి కలిసొచ్చినట్లు చెబుతున్నారు. మాన్యువల్‌గానే రికార్డు ఉండటంతో దానిని తిరిగి అదే వ్యక్తి పేరున రీస్టోర్ చేయడానికి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో పాత తేదీలతో రికార్డులు తయారు చేసి అటు కోర్టుకు, ఇటు ఉన్నతాధికారులకు నివేదిక పంపే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ నివేదికలో సంతకాలు చేయడానికి అటు వీఆర్వో నుంచి తహసీల్దార్‌పై ఒత్తిడి మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇప్పటికే మూడు రోజుల పాటు తహసీల్దార్ సెలవులో వెళ్లగా, వీఆర్వో అందుబాటులో లేకుండా పోయారు. తర్వాత వచ్చినా..మళ్లీ ఒత్తిడి మొదలైనట్లు తెలుస్తోంది. మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారికి ఆనుకుని, పట్టణ శివారులోని (ఎర్రగన్నమిట్ట) నాలుగురోడ్ల కూడలికి అతి సమీపంలో ఉంది. ఈ మొత్తం విస్తీర్ణంలో అర్ధ ఎకరాకుపైగా జాతీయ రహదారి విస్తరణకు పోగా, మిగిలిన అయిదు ఎకరాలు..ఎకరా రూ.6 కోట్లు అనుకున్నా..రూ.30 కోట్లు పోతుంది.

- మదనపల్లె-పుంగనూరు జాతీయ రహదారికి ఆనుకుని వలసపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-547లోని 2.73 ఎకరాలకు అధికార పార్టీ పెద్దలు ఎసరు పెట్టినట్లు చెబుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ భూమి కూడా ఎకరా రూ.5 కోట్లకుపైగా పలుకుతోంది. ఇదిలా ఉండగా ఈ భూమిని పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టా జారీ చేయగా, వివిధ కారణాలతో తర్వాత ఆ పట్టాను రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇక్కడ కూడా రద్దయిన పట్టాను పునరుద్ధరించే పనిలో రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ భూమిని ఆనుకునే ఉన్న పట్టా భూమిలో కలిపేసి ఫెన్సింగ్ వేసి రికార్డు పరంగా సక్రమం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలావుండగా, ఈ భూమిని ఫ్రీహోల్డ్ పథకంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఆఖరి నిమిషంలో అనుమానం వచ్చింది. తర్వాత రికార్డులను పరిశీలిస్తే ప్రభుత్వ భూమిగా కనుగొని మేల్కొన్న అధికారులు తర్వాత తీసేశారు. దీంతో ప్రభుత్వ స్వాధీన ఫైలును గుర్తించి నేతలు, దళారులు చేస్తున్న పునరుద్ధరణ అస్త్రానికి రెవెన్యూ అధికారులు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు చెబుతున్నారు. బసినికొండలోని సర్వే నెంబరు-1-1ఏ7 తరహాలో ఫైలు సిద్ధం చేయడంతో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో సంతకాలు చేయడానికి వెనకడుగు వేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా వలసపల్లె ఇన్‌చార్జి వీఆర్వో అప్పటి నుంచీ అందుబాటులో లేకుండాపోయారు. దీంతో వీఆర్వోకు మెమో జారీకి అధికారులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆ స్థానంలో మరో వీఆర్వోను ఇన్‌చార్జిగా నియమించి, తర్వాత జరగాల్సిన క్రతువుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఊరు చుట్టూ ఊడ్చేశారు

పేదలకు ఇచ్చిన డీకేటీ, అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారనే సమాచారం నేపథ్యంలో 2003కు ముందు జారీ చేసిన పట్టాదారుల జాబితాపై రాజకీయ నాయకులు, రియల్టర్లు జల్లెడ పట్టారు. జాతీయ రహదారులకు ఆనుకుని వెళ్తున్న, సమీపంలోని భూములు, అసైనీలపై ఆరా తీశారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉన్న భూములతో పాటు వివాదాస్పద, కోర్టు కేసులు, అన్నదమ్ముల మధ్య వివాదం ఉన్నా..సరే టేకప్ చేశారు. అడ్వాన్సులు ఇచ్చారు. అగ్రిమెంట్లు రాసుకున్నారు. తర్వాత రంగంలోకి దిగి కార్యాన్ని చక్కదిద్దే పనిలో ఉన్నారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని బి.కె.పల్లె, శివారు ప్రాంతాలైన కోళ్లబైలు, బసినికొండ, మండలంలోని వలసపల్లె, పోతబోలు, కొత్తవారిపల్లె, సీటీఎం రెవెన్యూ గ్రామాల్లో భూములపై దృష్టి పెట్టారు. ఈ భూముల్లో కొన్ని మదనపల్లె పట్టణానికి ఆనుకుని ఉండటంతో పాటు అన్నీ జాతీయ రహదారులకు అటు ఇటు ఉన్నాయి. పైగా బైపాస్ రోడ్డు కూడా ఉండటంతో వీటికి డిమాండ్ ఏర్పడింది.

రికార్డుల ప్రకారమే రిపోర్టు ఇస్తాం..

బసినికొండ, వలసపల్లె రెవెన్యూ గ్రామాల్లోని సర్వే నెంబరు-1-1ఏ7, 547లోని భూమిని ప్రభుత్వం ఇద్దరికి అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేయగా, తర్వాత వాటిని రద్దు చేసి తిరిగి స్వాధీనం చేసుకుంది. వీటికి సంబంధించిన ఫైళ్లు కార్యాలయంలో బయటపడ్డాయి. వాటిలో ఇప్పటికీ ఆ భూములు ప్రభుత్వ భూములుగానే ఉన్నాయి. వీటిపై ఉన్నతాధికారులు నివేదిక అడుగుతున్నారు. కార్యాలయంలో ఉన్న రికార్డు ప్రకారమే రిపోర్టు ఇస్తాం. సాధారణంగా గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు తీసుకున్న నిర్ణయాన్నే అమలు చేస్తాం.

\- షేక్ మహబూబ్‌చాంద్, తహసీల్దార్, మదనపల్లె



మదనపల్లె-పుంగనూరు జాతీయ రహదారి పక్కనున్న విలువైన భూములు



సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి, చిత్రంలో దేవగుడి నారాయణరెడ్డి, హేమాంబరధరరావు తదితరులు

కోటి టన్నుల టెండర్లు ఎలా పిలుస్తారు

- నచ్చిన కంపెనీలకు ముగ్గురాళ్ల గనులను ధారాదత్తం చేస్తున్నారు
- టీడీపీ ప్రభుత్వం రాగానే బాధ్యులను జైలుకు పంపిస్తాం
- టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, జనవరి 25: కోటి టన్నుల మంగంపేట ముగ్గురాళ్లను ఏ ప్రాతిపదికన టెండర్లకు పిలుస్తారని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు ప్రశ్నించారు. గురువారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ మంగంపేట ఏపీఎండీసీ వారు కోటి టన్నుల సీఅండ్‌డీ గ్రేడు కల్గిన ముగ్గురాళ్లను టెండర్లకు పిలిచారన్నారు. ఫిబ్రవరి 8న టెండర్లు ఓపెన్ చేస్తారన్నారు. ఇంత ఆగమేఘాలపైన టెండర్లను పూర్తి చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం, ఏపీఎండీసీ ఎండీ స్వంత సంస్థగా మార్చుకుని బినామీ, స్వంత కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. భారత దేశ చరిత్రలో కోటి టన్నుల టెండర్లకు పిలిచిన దాఖలాలు లేవని తెలిపారు. మంగంపేటలో 200లకు పైగా పల్వరైజింగ్ మిల్లులు ఉన్నాయని, వాటికి రాయి ఇవ్వకుండా ఇంత హడావుడిగా టెండర్లు పిలవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సీడీ గ్రేడు ముగ్గురాయి గతంలో టన్ను రూ.50 ఉంటే ప్రస్తుతం రూ.2020 చేశారన్నారు. గతంలో ఏడాదికి 900 టన్నుల ఏ-గ్రేడు రాయి, 400 టన్నుల బీ-గ్రేడు రాయిని మిల్లులకు ఇచ్చే వారని తెలిపారు. ప్రస్తుతం ఏ-గ్రేడు 400 టన్నులు, బీ-గ్రేడు 200 టన్నులు మిల్లులకు ఏ ప్రాతిపదికన కుదించారన్నారు. 30 పల్వరైజింగ్ మిల్లులకు ముడి సరుకు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. 200లకు పైగా పల్వరైజింగ్ మిల్లులను స్థానికులు, తదితరులు ప్రభుత్వ అనుమతితో బ్యాంకు రుణాలు పొంది నిర్మాణాలు చేసుకున్నారన్నారు. మిల్లులు నడవకపోవడంతో మిల్లుల్లో ఉన్న సామాగ్రి కూడా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ముగ్గురాళ్లలో అక్రమార్జన చేసిన డబ్బుతో ఎన్నికలకు ఉమ్మడి జిల్లాలో ఖర్చు చేయడానికి పన్నాగం పన్నినట్లు తెలిపారు. 2 వేల మందిని ఔట్‌సోర్సింగ్ కింద ఏపీఎండీసీలో తీసుకున్నారని వారు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడ ఇన్ని అక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులను జైలుకు పంపిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, హేమాంబరధరరావు, రాష్ట్ర బీసీ నాయకులు నాయిడోరి రమణ, కమతం నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

- నల్లారి సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు
- చంద్రబాబు సభాస్థలిని పరిశీలించిన నాయకులు



చంద్రబాబు సభా స్థలి వద్ద పనులను పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

పీలేరు, జనవరి 25: పీలేరులో 27న జరగనున్న 'రా...కదిలిరా' చంద్రబాబు నాయుడు బహిరంగ సభ నేపథ్యంలో పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పీడు పెంచారు. ఆయన వేగంగా పావులు కదుపుతూ వైసీపీలోని క్యాడర్‌ను తనవైపు తిప్పుకుంటున్నారు. అందులో భాగంగా ఇటీవల కేవీపల్లె, పీలేరు మండలాలకు చెందిన సుమారు 150 కుటుంబాలను పార్టీలో చేర్చుకున్న ఆయన గురువారం పీలేరు మండలంలో వైసీపీకి మరో షాక్ ఇచ్చారు. పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ గాయంవారిపల్లెకు చెందిన సుమారు 60 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వారందరికీ కలికిరి మండలం నగరిపల్లెలోని తన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంలో గ్రామగ్రామాన అనేక అబద్ధాలు చెప్పి ప్రజలను తమవైపు తిప్పుకున్న వైసీపీ నాయకులు అధికారం చేపట్టిన తరువాత వాటి గురించి పట్టించుకోలేదన్నారు. టీడీపీ, తన కుటుంబం చేసిన అభివృద్ధి తప్ప గ్రామాల్లో ఎక్కడా ఈ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కనిపించడం లేదన్నారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, పవన్ కళ్యాణ్‌లపై నమ్మకంతో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన అనుకూల పవనాలు వీస్తున్నాయని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది వైసీపీ శ్రేణులు తమవైపు వస్తున్నాయన్నారు. కొత్తగా టీడీపీలో చేరే వారికి సముచిత స్థానం ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. గాయంవారిపల్లెకు చెందిన గాయం వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, సూరి, చంద్రశేఖర రెడ్డి, భానుప్రకాశ్, లోకేశ్, హరిరామయ్య, రామిరెడ్డి, ఈశ్వరయ్య, సాంబయ్య, సోమశేఖర రెడ్డి, సుబ్బరామయ్య, శ్రీరాములు, ద్వారకనాథ్, మల్లిఖార్జున, చంద్రయ్య, ఉమా, మోహన్ తదితరులకు కిశోర్ సమక్షంలో టీడీపీలో చేరారు.

బహిరంగ సభ పనులను పరిశీలించిన నేతలు

ఈనెల 27వ తేదీ శనివారం జరిగే చంద్రబాబు బహిరంగ సభ పనులను గురువారం టీడీపీ నేతలు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి, ఆర్.శ్రీనివాసులు రెడ్డి, మల్లారపు రవిప్రకాశ్, మద్దిపట్ల సూర్యప్రకాశ్, శ్రీరామ్ చిన్నబాబు, జనసేన నేత గంగారపు రాందాస్ చౌదరి పరిశీలించారు. చంద్రబాబు పాల్గొనే సభ ప్రధాన వేదిక, హెలిప్యాడ్ పనులను వారి పరిశీలించి పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా పనులు ముగించాలని వారు నాయకులకు సూచించారు.

ఓటుహక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన

- ఎస్పీ కృష్ణారావు



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, జనవరి 25: ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగంపై పోలీసు సిబ్బందితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది చేత భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష తేడా లేకుండా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్ఈబీ ఈఎస్ శ్రీనివాసులు, ఎస్ఈబీ ఏఈఎస్ ఎ.రవి, సీఐలు, ఏఆర్‌ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

భాకరాపేట వద్ద రూ.70 లక్షలు పట్టివేత


నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సిద్దవటం, జనవరి 25 : మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీలో ఎలాంటి ఆధారాలు లేని 70 లక్షల నగదును సీజ్ చేసినట్లు సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గురువారం తాడిపత్రికి చెందిన వెంకట నారాయణరెడ్డి తిరుపతిలో ఉన్న స్థలాన్ని అమ్మి 70 లక్షల నగదును తన వాహనంలో తీసుకుని వెళుతున్నాడన్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశామని, డబ్బును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం


ముగ్గురు పిల్లలతో భార్గవి

చిన్నమండెం, జనవరి 25: మండలంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన భార్గవి అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆమె తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... భార్గవి అనే మహిళ తన భర్త బతుకుదెరువు కోసం కువైత్ వెళ్లగా తన ముగ్గురు బిడ్డలతో రూపేష్ (7), చరిష్మా (5), నిషా (3) శ్రీరామ్‌నగర్ కాలనీలో ఉంటోంది. ఈనెల 23వ తేదీ సాయంత్రం 3 గంటల సమయంలో తన అత్తగారి ఊరు చాకిబండ కుమ్మరిపల్లికి వెళుతున్నానని చెప్పి ఆటోలో వెళుతుండగా చివరిసారిగా చూసినట్లుగా తల్లి చెబుతోంది. అదేరోజు అత్తగారింటికి చేరి అక్కడ తోడికోడలు, అత్తగారితో గొడవపడి రాత్రి 7 గంటల సమయంలో అంగడికి వెళ్లి వస్తానని వెళ్లిందని, అప్పటి నుంచి తన కూతురు, పిల్లల ఆచూకీ తెలియరాలేదని భార్గవి తల్లి కృష్ణవేణి చెబుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వివరాలు తెలిపిన వారు చిన్నమండెం పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- రూ.లక్ష విలువ చేసే 347 మద్యం బాటిళ్లు స్వాధీనం


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కడప (క్రైం), జనవరి 25 : కడప నగరం అశోక్‌నగర్ పాత బైపాస్ వద్ద ఓ వ్యక్తి రూ.లక్ష విలువ చేసే మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తుండగా చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేశారు. గురువారం చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో సీఐ నరసింహారెడ్డి నిందితుడి వివరాలు వెల్లడించారు. కడప రాజారెడ్డివీధికి చెందిన ఎర్రబల్ల సుధీర్ ప్రస్తుతం సీకేదిన్నె మండలం ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 35 ఫుల్ బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లు, 375 ఎంఎల్ 10, క్వార్టర్ బాటిళ్లు 290 మొత్తం 347 బాటిళ్లు సంచుల్లో పట్టుకుని తీసుకెళుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. డీఎస్పీ షరీఫ్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ రవికుమార్, మహ్మద్‌రఫీ సిబ్బందితో నిందితుడిని అరెస్టు చేసి బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ లక్ష రూపాయలు ఉంటుందన్నారు.

వల్లూరులో 71 బాటిళ్లు...


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

వల్లూరు, జనవరి 25 : మండల పరిధిలోని శీతోరుపల్లెలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని విషయం తెలియడంతో ఎస్‌ఐ వెంకటరమణ సిబ్బంది దాడులు చేసి దాదాపు 71 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు... శీతోరుపల్లె గ్రామంలో వల్లూరుకు చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే వారిని ఉపేక్షించేదిలేదని ఎస్‌ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ మోహన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు... సిలిండర్లు స్వాధీనం


సీజ్ చేసిన సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం)/ఖాజీపేట, జనవరి 25 : కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ప్రతిరోజూ దాడులు నిర్వహిస్తున్నారు. గురువారం ఖాజీపేటలోని మైదుకూరు రోడ్డులో గల శ్రీరామ ఎలక్ట్రికల్స్, ప్రహ్లాద ఎలక్ట్రికల్స్ షాపులపై ఖాజీపేట మండల ఆర్‌ఐలతో కలిసి దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శ్రీరామ ఎలక్ట్రికల్స్‌లో అక్రమంగా వినియోగిస్తున్న 3 ఇండేన్, 1 భారత్ గృహావసర సిలిండర్లను, ఆరు చిన్నసిలిండర్లను, శ్రీప్రహ్లాద ఎలక్ట్రికల్స్‌లో 4 ఇండేన్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వాటిని సీజ్ చేసి ఖాజీపేట ఆర్‌ఐకి అప్పగించారు. ఆయా షాపుల యజమానులైన సుంకు ప్రభాకర్, ప్రహ్లాద అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు పెనుగొండ రవి, హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగతో పాటు స్మగ్లర్ అరెస్ట్

రామాపురం, జనవరి 25: రాయచోటి రేంజ్ పరిధిలోని గువ్వలచెరువు తూర్పు భాగంలోని కొత్తిమడుగు బీట్ పరిధిలో గురువారం ఎర్రచందనం దుంగను స్వాధీనం చేసుకుని స్మగ్లర్ సొక్క లింగంను అరెస్టు చేసినట్లు వంగిమళ్ల సెక్షన్ ఆఫీసర్, ఎఫ్ఎస్వో భరణికుమార్ తెలిపారు. రామాపురం మండలం గువ్వలచెరువు తూర్పు భాగంలోని కొత్తిమడుగు బీటులో కూంబింగ్ నిర్వహిస్తుండగా జీలో బావి ప్రదేశంలో సుమారు పది మంది ఎర్రచందనం కూలీలు చెట్లను నరుకుతుండగా దాడి చేయడంతో ఒకరు పట్టుబడగా 9 మంది పరారైనట్లు ఆయన తెలిపారు. ఈదాడిలో ఎఫ్‌బీవో మహబూబ్ బాషా, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుమర్రి వద్ద 3 కేజీల వెండి సీజ్


సీజ్ చేసిన వెండి వస్తువులతో ట్రైనీ డీఎస్పీ

కొండాపురం, జనవరి 25 : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద గురువారం పోలీసులు మూడు కేజీల వెండి వస్తువులను సీజ్ చేశారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రమణయ్య అనే వ్యక్తి తాడిపత్రి నుంచి రాయచోటికి కారులో వెండి వస్తువులను తీసుకెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. వీటిని ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ... దొంగలు దొరికారు

వేంపల్లె, జనవరి 25: వేంపల్లెలోని రామాలయంలో బంగారు, వెండి నగలను చోరీ చేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. దొంగతనం జరిగిన వెంటనే సీఐ చాంద్‌బాషా చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చి తనిఖీలు నిర్వహించడంతో రాయచోటిలో పట్టుబడ్డట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాబోయ్.. దొంగలు



- పట్టపగలే చోరీలు ● అందినవన్నీ దోచుకెళుతున్నారు ● సీకే దిన్నె ఠాణాకు సవాల్

చోరీలను అరికట్టాలి..



నాకు నాలుగు లారీలు ఉన్నాయి. బాడుగలు లేనప్పుడు లారీలను ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో ఉంచుతాము. సంక్రాంతి పండుగ కనుమ రోజున ఏకంగా రెండు లారీలలోని బ్యాటరీలను చోరీచేశారు. పోలీసులు చోరీలను అరికట్టాలి.

- సుభాన్, లారీ ఓనర్, ప్రొఫెసర్స్ కాలనీ

బెంబేలెత్తుతున్నాం..



నేను మేకలు మేపుకుంటు జీవనం సాగిస్తున్నాను. ఇప్పటికి పలుమార్లు మా మేకలను దొంగలించారు. పోలీసులకు చెప్పుకున్నా ప్రయోజనం లేదు. కాలనీలోని పలు ఇళ్లలో కూడా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో బెంబేలెత్తుతున్నాం.

- ఓబులేసు, మేకల కాపరి, సాయిప్రతాప్ కాలనీ



కడప(రూరల్), జనవరి 25: కడప రూరల్, అర్బన్ ఏరియాలోని చింతకొమ్మదిన్నె ఠాణాలో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే దొంగతనాలు చేస్తున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ చిక్కినవన్నీ దోచుకెళుతున్నారు. ఎవరు లేనిది చూసి ఇళ్లల్లోకి ఎగబడి చోరీలకు పాల్పడుతూ హల్‌చల్ చేస్తున్నారు. ఒకే గ్రామంలో (సాయిప్రతాప్ నగర్‌లో) వరుసగా చోరీలకు తెగబడ్డారు. ఇలా ప్రతి రోజు ఏదో ఒకచోట మేకలు, పొట్టేళ్లు, కోళ్లు, మంచినీటి మోటార్లు, లారీలు, ఆటోల బ్యాటరీలు, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరు, అందులోని ఆయిల్, వ్యవసాయ మోటార్లు, సర్వీసు వైర్లు, పైపులు, ఇనుప వస్తువులు... ఇలా ఏదిపడితే అది దోచుకెళ్తుండడంతో జనం ఆందోళనచెందుతున్నారు. రాత్రివేళల్లో కాకుండా పగటిపూటనే దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు అందినప్పటికీ దొంగలు మాత్రం వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు.

ఇవీ వరుస దొంగతనాలు..

- సీకేదిన్నె ఠాణాకు కూతవేటు దూరంలోని సాయిప్రతాప్ నగర్‌లో 2023 డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగరోజున గంగాదేవి అనే మహిళకు చెందిన రూ.20వేల విలువచేసే పొట్టేలును పట్టపగలే దొంగలు ఎత్తుకెళ్లారు. దీనికి రెండు రోజుల క్రితమే ఇదే మహిళకు చెందిన రెండు నాటుకోళ్లను ఎత్తుకెళ్లారు.
- 2023 డిసెంబర్ 26న సాయిప్రతాప్‌నగర్‌లోనే శ్రీనువాసులుకు చెందిన ఇంటిలోని రూ. 15 వేల విలువచేసే రెండు మంచినీటి మోటార్లను చోరీచేశారు. ఆ మరుసటి రోజు కోర్టు ఉద్యోగికి చెందిన పక్కింటిలోని మరో మోటారు దోచుకెళ్లారు.
- సాయిప్రతాప్ నగర్‌లోనే ఓబులేసు అనే మేకల కాపరికి చెందిన రూ.20వేల విలువ గల రెండు మేకలను ఇటీవల దొంగలు దోచుకెళ్లారు.
- సంక్రాంతి పండుగ కనుమ రోజున ప్రొఫెసర్స్ కాలనీలో సుభాన్‌బాషాకు చెందిన రెండు లారీల్లోని రూ.10వేల విలువ చేసే రెండు బ్యాటరీలను దోచుకెళ్లారు. ఇంతకు మునుపు కూడా ఇదే కాలనీలో నబీల్‌కు చెందిన లారీలోని రూ.5వేల విలువగల బ్యాటరీని గుర్తు తెలియని దొంగలు దోచుకెళ్లారు. ఇప్పటికైనా పోలీసులు నిఘాను పెంచి దొంగతనాలను అదుపుచేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తున్నాం..



చోరీలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా స్పందిసున్నాం. నిఘాను ముమ్మరం చేశాం. ఇప్పటికే పలుమార్లు చోరీలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టుచేశాం. చోరీలను పూర్తి స్థాయిలో అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాసులరెడ్డి, ఎస్‌ఐ, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్

వైభవంగా కోదండరాముడి కళ్యాణం


భక్తులకు మాంగళ్యాన్ని చూపిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, జనవరి 25 : ఏకశిలా నగిరి కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద నుంచి కల్యాణతంతును ప్రారంభించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణను వైష్ణవ సంప్రదాయంలో వేదపండితులు నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణను సీతమ్మ తల్లికి శ్రీరామచంద్రుడు సమర్పించారు. మాంగళ్యధారణ అనంతరం తలంబ్రాలు సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు .

దళారులను నమ్మొద్దు

ఖాజీపేట, జనవరి 25: రైతులు పండించిన జొన్న పంటను దళారీ వ్యవస్థ కంటే అధికంగా ప్రభుత్వం కొంటుందని ఏపీ సీడ్స్ డీఎం అర్జున్‌రావ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మిడుతూరులోని రైతులు ఆరబెట్టిన జొన్న పంటను రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారీలు మార్కెట్‌ధర రూ.2,200లకు తీసుకుంటున్నారని, ప్రభుత్వం మద్దతు ధర రూ.3180తో కొనుగోలు చేస్తుందన్నారు. ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతు వద్ద ఎకరాకు 18 క్వింటాళ్లు చొప్పున 14 శాతం తేమ ఉన్న పంటను కొనుగోలు చేస్తామన్నారు. మండల పరిధిలో 955 ఎకరాల జొన్న పంట సాగు చేశారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగార్జున, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపయోగంలో లేని చెక్కులు దహనం


చెక్కుబుక్కులను దహనం చేస్తున్న అధికారులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 25: అన్నమయ్య జిల్లా ఖజానాశాఖ పరిధిలోని 8 ఉప ఖజానా కార్యాలయాల్లో ఉపయోగంలో లేని చెక్కు బుక్కులను గురువారం దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి సయ్యద్ మహబూబ్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో ఉపయోగంలో లేని 4380 చెక్కు.బుక్కులు దహనం చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో 10 మంది జిల్లాస్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమీక్షించడం జరిగిందన్నారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయం ప్రకారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపయోగంలో లేని చెక్కు.బుక్కులను జిల్లా అడిషనల్ ఎస్పీ, రెవెన్యూ అధికారి, రిజిస్ట్రార్, అగ్నిమాపక దళ అధికారి, జిల్లా ఖజానా అధికారి ఆధ్వర్యంలో 8 ఉప ఖజానా అధికారుల సమక్షంలో చెక్కు. బుక్కు. లను దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఖజానా అధికారి ఖాదర్‌వలి, జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పరీక్షల తనిఖీ


పరీక్షలను పరిశీలిస్తున్న వైస్ ఛాన్సలర్


కడప (ఎడ్యుకేషన్), జనవరి 25 : వైవీయూలో జరుగుతున్న పీహెచ్‌డీ పరీక్షలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం వైవీయులో ఏపీజె అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయ ఆవరణంలో జరుగుతున్న ప్రీ పీహెచ్‌డీ పరీక్షల కేంద్రానికి ఆకస్మికంగా వెళ్లి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు వంటి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి : ఇన్‌చార్జ్ కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 25: జిల్లాలో చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి విజయవాడ సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, ల్యాండ్, సర్వే ఏడీ జయరాజ్, డ్వామా పీడీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూడో దశ రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత బాధితులను గుర్తించిన వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

28న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్


కరపత్రం ఆవిష్కరిస్తున్న లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి

సీకేదిన్నె, జనవరి 25: కడప నగరం రామచంద్రాపురంలోని మ్యాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూలులో ఈనెల 28న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో వయస్సుతో నిమిత్తం లేకుండా పాల్గొనవచ్చన్నారు. లక్ష రూపాయలు ప్రైజ్‌మనీ అందించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు 9346240540 నెంబరుకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సురేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఓటమి ఫోబియా వెంటాడుతోంది

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

రాయచోటి టౌన్, జనవరి 25: ముఖ్యమంత్రి జగన్‌ను ఓటమి ఫోబియా వెంటాడుతోందని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఇంటికి పోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, రాజంపేట పార్లమెంట్ కోఆర్డినేటర్ తులసిరెడ్డి అన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 25 మంది మంత్రులు కూడా ఓటమి పాలవుతారని సర్వేలు చెబుతున్నాయన్నారు. ఆయన సొంత నియోజకవర్గంలో కూడా సభ పెడితే జనం లేక వెలవెలబోతున్నాయని, అందుకే ఆయన సంతోషంగా దిగిపోతాననంటూ ఓటమి ముందే ఒప్పుకుంటున్నట్లుగా ఉందన్నారు. ఆయన 90 శాతం సంక్షేమ పథకాలు అమలు చేశానని గొప్పలు చెప్పుకుంటున్నా అవి ఎక్కడా అమలైన దాఖలాలు లేవన్నారు. నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను నవ మోసాలు చేస్తూ పబ్బం గడుపుకుంటూ ప్రచార ఆర్భాటాలు తప్ప సంక్షేమ అభివృద్ధి కంటికి కనిపించడం లేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ చీల్చిందని చెబుతున్నా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్ర విభజన కోసం మొదటి సంతకం చేసింది కూడా ఆయనే అనే విషయం మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు, నియోజకవర్గ కన్వీనర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి

చిట్వేలి, జనవరి 25: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందించాలని ఏడీఏ మణి దుకాణ దారులను ఆదేశించారు. గురువారం చిట్వేలిలోని దుకాణాలను వ్యవసాయాధికారి సందీప్‌తో కలిసి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కాపాడాలంటే నాణ్యమైన ఎరు వులు, పురుగు మందులు అందించడం ద్వారానే సాధ్యమన్నారు. నాసిరకం ఎరువులు, పురుగు మందులు అమ్మితే అలాంటి దుకాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీరామ్, దుకాణం యజమానులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, జనవరి25: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, అరాచకాలు పెరిగిపోయాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా నేను ఉన్నాను, నేను విన్నాను, నేను చూశాను అని కొత్త కొత్త డైలాగులు చెప్పి ఆడబిడ్డలకు అండగా ఉంటానని అపద్ధపు మాటలు చెప్పి మహిళా సంక్షేమాన్ని మూలన పడేశారని ఆరోపించారు. అంగన్వాడీ అక్కచెల్లెమ్మలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 42 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడితే మగ పోలీసుల చేత దాడులు చేయించడం దారణమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం..

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



రాజంపేట పాతబస్టాండులో ఏర్పాటు చేసిన మానవహారం, గాలివీడులో విద్యార్థులతో ర్యాలీ, రైల్వేకోడూరులో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, జనవరి 25: ప్రజలకు ఓటు వజ్రాయుధం అని రైల్వేకోడూరు ఎన్నికల ఉప తహసీల్దార్ సిదేశ్వరప్రసాద్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్ల ను ఘనంగా సన్మానించారు. రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట పట్టణంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. పాతబస్టాండు కూడలిలో ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పా టు చేశారు. 80 సంవత్సరాలు నిండిన సీనియర్ ఓటర్లకు, 18 సంవత్సరాలు నిండి నూతనంగా ఓటరు పొందిన వారికి సన్మానం నిర్వహించారు.

గాలివీడు : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని.. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును విని యోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడు కోవాల్సిన ఆవశ్యకత యువతీ, యువకులపై ఉందని తహసీల్దార్ దైవాధీనం అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి బస్టాండు నుంచి గేటు వరకు ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, ఆర్‌ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్వేలి : జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా గురువారం తహశీల్దారు శిరీష ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి విద్యార్థుల చేత నినాదాలు చేస్తూ పాత బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ఆవరణలో విద్యార్థుల చేత ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్లకు సన్మానం నిర్వహించారు. ఎంఈవోలు కోదండనాయుడు, ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి, ఆర్‌ఐ శేషంరాజు, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ప్రజా స్వామ్యానికి ఓటు పునాదిలాంటిదని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, శ్రీవెంకటేశ్వర జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డిలు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటుపై యువతకు అవగాహన కల్పంచారు. అనంతరం ఎన్ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటును వేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించి.. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

పుల్లంపేట : పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని తహశీల్దారు నరసింహకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను శాలువాకప్పి పూలమాలతో సత్కరించారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌తో ప్రజా రవాణా సులభతరం



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, జనవరి 25: ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో ప్రజా రవాణా మరింత సులభతరం అవుతుందని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలో రూ.18లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్ట ణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాహనాల వినియోగం, రాకపోకలు పట్టణంలో బాగా పెరిగాయని, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయా లని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్‌లు దశరథరామిరెడ్డి, ఫయాజుర్ రెహమాన్, డీఎస్పీ మహబూబ్‌బాషాలతోకౌన్సిలర్లు, ట్రాఫిక్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



వైద్యశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి ఉషశ్రీ

సుండుపల్లె, జనవరి 25: చిన్నారులకు, గర్భిణీలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని జిల్లా అధికారి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. గురువారం మండలంలోని రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. రోగుల హాజరు నమోదును అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌యం, సీహెచ్‌వో, ఆశాలకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గర్భిణులను 12 వారాలలోపు గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. మాతృ, శిశు మర ణాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. గర్భిణులు ప్రతి వారం వైద్యుల సూచనలు, సలహాలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శేఖర్‌రెడ్డి, సీహెచ్‌వో నారాయణ, వైద్య సిబ్బంది వీరనారాయణ, నటేశ్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పంతగాని నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో వైద్యం చేయించుకున్న మహిళలు

చిట్వేలి, జనవరి 25: ప్రజలకు సేవ చేయడం వరంగా భావిస్తున్నానని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పంతగాని ఆధ్వర్యంలో తిరుపతి స్విమ్స్ వైద్య బృందం డాక్టర్ నీలిమ పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించింది. పంతగాని నరసింహప్రసాద్ తండ్రి డాక్టర్ చిన్నపుల్ల య్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా నాగవరంలో పింక్‌బస్ ద్వారా మహిళల కోసం నిర్వహించిన వైద్యశిబిరంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో నరసింహ ప్రసాద్ సతీమణి డాక్టర్ నీలిమ, ముక్కా సాయివికాస్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజ నేయులు, కట్టు గుండయ్య, జనసేన నేత ముత్యాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

అన్నమయ్యజిల్లా, లక్కిరెడ్డిపల్లి మండలం, అప్పకొండయ్యగారిపల్లిలో కాపురముండు మా కక్షిదారు అయిన లేట్ మునలిరెడ్డిగారి నడిపి రెడ్డెన్నగారి కుమారుడు మునలిరెడ్డి గారి రాజారెడ్డి [illegible] ... 12-12-1960న ... 1487/1960ద్వారా ... [illegible] ... షెడ్యూల్: అన్నమయ్య జిల్లా - లక్కిరెడ్డిగారిపల్లి సబ్-జిల్లా - లక్కిరెడ్డిగారిపల్లి మండలం-బిస్నిపాడు గ్రామ రెవిన్యూ దాఖలా- సర్వేనెంబరు 568, ... ఎ. 5.94సెంట్లు పైకి. ఎ. 2.37 సెంట్లు ఐయుబ చెక్కుబంది: తూర్పు: యల్లయ్య జమీను, పడమర: తిరుపతి గంగన్న జమీను, ఉత్తరము: కుంట, దక్షిణము : రాజారెడ్డి జమీను, ఈమధ్య పై విస్తీర్ణము ఎ. 2.37 సెంట్లు మాత్రా

జి. ఈశ్వర్ రెడ్డి, న్యాయవాది, పీలేరు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి

వీరబల్లి, జనవరి 25: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలని మండల అభివృద్ధి అధికారిణి మల్లీశ్వరి పేర్కొన్నారు. గురువారం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో జరిగిన రైతు ఉత్పత్తిదారుల బోర్డు ఆఫ్ డైరెక్టర్ల కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతు సంఘాల నెల వారీ సమావేశాలు నిర్వహించుకోవడం వల్ల సంఘాలు బలపడతాయని చెప్పారు. రైతు లకు తమ ఉత్పత్తుల గిట్టుబాటు ధర కల్పించేందుకు సేకరణ కేంద్రం అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏపీ యం ఖాదర్‌వలి, సీసీ వెంక టలక్ష్మి, రైతు మిత్రలు, బీవోడీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జనవరి 25: నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న జరిగే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యూఈసీ డబ్ల్యు యూ) 2వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డిస్కం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రాలు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పాల్గొని ఈమహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. యూఈసీడబ్ల్యుయూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నగేశ్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి కుర్చీలు వితరణ

రాయచోటిటౌన్, జనవరి 25: పట్టణంలో నూతనంగా ప్రారంభించిన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం గురువారం రాయచోటి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 10 కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ డేవిడ్ సుకు మార్ మాట్లాడుతూ రాయచోటి లయన్స్‌క్లబ్ సేవలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుర్చీలు అందజేసిన దాత మిక్కిలినేని ప్రసాద్ నాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో స్వచ్ఛభారత్

పెనగలూరు, జనవరి 25 : మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో గురువారం ఆదర్శ జూనియర్ కళాశాల విద్యార్థులచే స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం-2 కార్యక్రమంలో భాగంగా హాస్టల్ వార్డెన్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు హాస్టల్ ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఒంటిమిట్ట, జనవరి 25 : మండల పరిధిలోని సాలాబాదు గ్రామంలో అక్రమ మద్యం అమ్ముతున్న మంగదొడ్డి పెంచలయ్య అనే వ్యక్తిని గురువారం ఒంటిమిట్ట పోలీసులు అరెస్టు చేశారు. సాలాబాదు ఎస్సీ కాలనీలో అక్రమంగా మద్యం నిల్వ ఉందన్న సమాచారం రావడంతో ఎస్‌ఐ మధుసూదన్‌రావు సిబ్బందితో కలిసి దాడి చేసి పెంచలయ్య ఇంటిలో ఉన్న 3 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

PUBLIC NOTICE

Under instructions from my client **M/s Shriram Finance Limited, KADAPA -II** Branch issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Rachapalli Janardhana Reddy** S/o R. Narayana Reddy R/o Kasturirajupalli H/o Lakkireddypalli Village, Post, Rayachoty Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. SCHEDULE OF PROPERTY:-Annamayya District, erst while Y.S.R. Kadapa District, Rayachoty Sub Reg. Dist., Rayachoty Mandal, **Masapeta Village Polam in Sy. No. 240** an extent of **462.21 square yards** out of **12-75** cents Item No.1 : An extent of **248.88 square yards in Plot No. 25,26** Bounded by: East– 15 feets width Rasta, West - Site in Plot No.37,38, North - 22 feets width Rasta, South - Site in Plot No.27. Measuring : East - West = 40 feets, North - South = 56 feets. Item No.2 : An extent of **213.33 square yards in Plot No. 37,38** Bounded by: East– Site in Plot No. 25,26 West - 15 Feets Width Rasta, North - 22 feets width Rasta, South - Site in Plot No.39. Measuring : East - West = 40 feets, North - South = 48 feets.(Property covered under registered sale deed No. 10819/2021)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

మదనపల్లె పురపాలక సంఘము

ఈ- ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 1394/E1/2020 తేది: 25-01-2024

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకుగాను ఈ- ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి.

వ. నెం.	Funds	Tender ID Nos.	పనుల సంఖ్య	పనుల అంచనా మొత్తము (ECV)
1.	General Funds	713076,713083,713095,713103, 713149,713190,713207,713213, 713351,713355,713361,713374, 713378,713390,713398,713403	16	78.64 లక్షలు
2	Pedalandiriki Illu Funds	713333,713345,713364,713371	4	33.52 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరములు కొరకు వారి e procurement market place నందు చూడవలెను మరియు ఆఫీసు పని వేళల యందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలుతేది : 25-01-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరితేది : 09-02-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 09-02-2024 ఉ॥11.15గం॥లకు

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

సం/- **కమీషనర్,** మదనపల్లె పురపాలకసంఘం

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జనవరి 25: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా యువత ముందున్న సవాళ్లు అనే అంశంపై ఈ నెల 29న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సులో నిరుద్యోగులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు గణేశ్, చిన్నారెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



రాయచోటిలో అంబేడ్కర్ ప్లెక్సీ వద్ద, లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

రాయచోటిటౌన్, జనవరి 25: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ గురువారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల అంబేడ్కర్ ప్లెక్సీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చిన్న రెడ్డెన్న మాట్లాడుతూ పెన్షనర్ల సమ స్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే 11 పీఆర్‌సీలో 2022 సంవత్సరం జనవరి నుంచి తగ్గించిన అడిషినల్ క్వాంటమ్‌ను తిరిగి యధావిధిగా కొనసాగించాలన్నారు. అంతకుముందు ఇస్తున్నట్లు 70 ఏళ్లు నిండిన వారికి పది శాతం, 75 సంవత్స రాలు నిండిన వారికి 15 శాతం చొప్పున పునరు ద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాల న్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ పరిధిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం లీడర్లతో పాటు ఎన్జీవో సంఘం నేతలు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బలరామరాజు, ప్రసాద్, ఉపాధ్యాయ సంఘం నేతలు జాబీర్, రాజారమేశ్ పాల్గొన్నారు.

ఎరియర్స్ వెంటనే చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 25: పెన్షనర్లకు 11వ పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని లక్కిరెడ్డిపల్లె తాలూక పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు విశ్వనాధయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈసందర్భంగా విశ్వనా ధయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే దశలవా రీగా పోరాటాలు చేస్తామన్నారు. పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణయ్య, కోశాధికారి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



పాతరాయచోటి శివాలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జనవరి 25: పట్టణంలోని పాత రాయచోటిలో మాండవ్యనది ఒడ్డున వెలిసిన ప్రాచీన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆలయంలో గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం ద్రాక్షాయణి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ భక్తులతో పాటు పాతరాయచోటి భక్తులు, కన్నడ భక్తులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గంగాభవానీ ఆలయంలో...

సిద్దవటం, జనవరి 25: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారు పేట గ్రామ శివారులో వెలసిన గంగాభవానీ అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన పలు అభిషేకాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు మాడా పెద్ద సుబ్బరాయుడు, రామకృష్ణల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు.

పథకాలను తెలియజేయడం కోసమే 'వికసిత్ భారత్'

● బీజేపీ రాష్ట్ర మేధావుల సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాసకుమార్‌రాజు

రాయచోటిటౌన్, జనవరి 25: గడిచిన పది సంవత్సరాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు తెలియజేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టిందని బీజేపీ రాష్ట్ర మేధావుల సంఘం మాజీ సభ్యుడు, రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్‌కుమార్‌రాజు అన్నారు. గురువారం ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలపై మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో 2014 నుంచి 2019 వరకు, 2019 నుంచి 2024 వరకు బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేందుకు చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమం గురువారంతో ముగిసిందన్నారు. ముఖ్యంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం 400 రకాల సంక్షేమ పథకాలను గడిచిన పదేళ్లలో అమలు చేసిందన్నారు. అందులో ప్రధానంగా ఉజ్వల గ్యాస్ యోజన, పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి అవాస్ యోజన, ప్రధాన మంత్రి జన్‌ధన్ యువజన పథకంతో జీరో బ్యాలెన్స్ ద్వారా యువకులకు రుణాలు మంజూరు, చేతి వృత్తి వారికి విశ్వకరణ యోజన పథకం ద్వారా సంక్షేమ పథకాలు రుణాలు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో సత్తా చాటిన నందలూరు క్రీడాకారులు



కోకోలో మొదటి స్థానాన్నికైవసం చేసుకున్న బాలికల జట్టు

నందలూరు, జనవరి 25: రాజంపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో నందలూరు క్రీడాకారులు తమ సత్తా చాటారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ కళాశాల క్రీడామైదానంలో జరిగిన బాలికల కోకో పోటీల్లో మొదటి స్థానాన్ని, కబడ్డీ, వాలీబాల్‌లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదే విధంగా బాలుర జట్టు కోకోలో ఫైనల్ చేరగా వాలీబాల్‌లో మూడవ స్థానంలో నిలిచింది. మండల క్రీడాకారులు క్రీడాపోటీలలో సత్తాను చాటి నందలూరు కీర్తిప్రతిష్టలు పెంపొందించారని ఎంపీడీవో సౌభాగ్యమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఈవోఆర్‌డీ సతీష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు కృష్ణయ్య, సుశ్మిత, విశ్వనాథ్, పీఈటీ పవార్ జగన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రా...కదిలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రైల్వేకోడూరు, జనవరి 25: వీలేరులో ఈనెల 27న టీడీపీ నిర్వహిస్తున్న తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదిలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు కోరారు. గురువారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల నుంచి పదివేల మందిని జనసమీకరణ చేస్తున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూస్తామా అని ఎదురు చూస్తున్నారన్నారు. సమావేశంలో ప్రత్యేక పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, రైల్వేకోడూరు నియోజకవర్గ పరిశీకులు హేమాంబరధరావు, మండలాల పరిశీలకులు ఆర్‌సీ మునికుమార్, పులి జనార్ధన్‌రెడ్డి, చిన్నబాబు, ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ వికాసం పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట టౌన్, జనవరి 25: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రజ్ఞ వికాసం పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో పురుషోత్తం తెలియజేశారు. రాజంపేట పట్టణంలోని ఇన్‌ఫెట్ స్కూల్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ప్రజ్ఞా వికాసం పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్‌పురుషోత్తం, ఆర్‌ఐపీఈ భానుమూర్తిరాజులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాట పటిమ ఉన్న సంఘాలు ఇలాంటి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలన్నారు. ఎంఈవో సుబ్బరాయుడు, నందలూరు ఎంఈవో నాగసుబ్బయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, నాయకులు జశ్వంత్, చంగయ్య, సుమంత్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



రికార్డుల నిర్వహణపై సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఓబులవారిపల్లె, జనవరి 25: మండల కేంద్రంలోని మండల ప్రభుత్వ వైద్యశాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో చెన్నకృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య కార్యక్రమాల నిర్వహణ వంటి వివరాలను అడిగి తెలుసు కున్నారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గురుమహేష్, డాక్టర్ దీప, ఆప్తామాలిక్, ఆఫీసరు ఓబులేసు, సీనియర్ అసిస్టెంట్ సిద్ది రామయ్య, సీహెచ్‌వో నగేష్, ఫార్మాసిస్ట్ మహాలక్ష్మి, స్టాఫ్‌నర్స్ ఇమాంబీ, జయభారతి పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన నూతన కమిటీ కార్యవర్గం ఏకగ్రీవం

రాజంపేట, జనవరి 25 : రాజంపేట పట్టణ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారిల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో అన్నమయ్య జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా సోమారపు నాగార్జున ఆచారిని, గౌరవాధ్యక్షుడిగా లక్ష్మీప్రసన్న ఆచారిలను ఎంపిక చేశారు. అలాగే అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ సుధాకర్ ఆచారి, ప్రధాన కార్యదర్శిగా టి.మోహనాచారి, కోశాధికారిగా సి.రత్నమ్మఆచారి, రాష్ట్ర అధ్యక్షుడు పావు లూరి హనుమంతరావులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.



చిత్తూరులో మానవహారం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా చిత్తూరు నగరం గాంధీ సర్కిల్ వద్ద గురువారం అన్ని విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువతీయువకులచే భారీఎత్తున మానవహారం నిర్వహించారు. ఓటు ప్రతిజ్ఞ అనంతరం ర్యాలీని కలెక్టరు షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించగా.. నాగయ్య కళాక్షేత్రం వరకు సాగింది.

- చిత్తూరు కలెక్టరేట్



స్వస్తిక్ గుర్తు ఆకారంలో..

కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు రైట్ టు ఓట్ అనే అక్షరాకృతిలోను, 'స్వస్తిక్ గుర్తు ఆకారంలో నిలబడ్డారు. ఓటుపై అవగాహన కల్పించారు.

- కుప్పం



ఓటు సద్వినియోగం చేసుకుంటాం

చేతిలో ఓటరు కార్డులు చూపుతూ.. ఓటుహక్కును సద్వినియోగం చేసుకుంటామని సదుంలో సంఘమిత్రలు పేర్కొన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా వీరు ప్రతిజ్ఞ చేశారు.

- సదుం

కాణిపాకంలో పున్నమి గరుడ సేవ



ఐరాల (కాణిపాకం), జనవరి 25: కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో మంగళవారం పున్నమి గరుడ సేవ నిర్వహించారు. ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకంచేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. గరుడ వాహన ధారుడైన స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో మూలవిరాట్ వెనుక
బంగారు తాపడం గోడ

ఆలయంలో బంగారు వాకిలి ఏర్పాటు ● ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం

ఐరాల(కాణిపాకం), జనవరి 25: కాణిపాకంలోని ప్రధాన ఆలయంలో మూల విరాట్ వెనుక భాగంలో బంగారు తాపడం గోడ ఏర్పాటుకు ధర్మకర్తల మండలి సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. కాణిపాకంలోని సమావేశ మందిరంలో గురువారం బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ వివరాలను ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు వెల్లడించారు. రాగి రేకులకు బంగారు తాపడం ఏర్పాటు చేసి అమర్చి గోడను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆలయంలో బంగారు వాకిలి ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు వచ్చారన్నారు. దాతలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

ఐకారవి, గుత్తికొండశ్రీనివాస్, రామకృష్ణప్రసాద్ సహకారంతో బంగారు వాకిలి, వెండి వాకిలిని ఏప్రిల్ నెలలోపు అందుబాటుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. ప్రధాన ఆలయంలో అనుబంధంగా ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని రూ.1.10 కోట్లతో రాతి కట్టడం కట్టడానికి దాత అనిల్‌కుమార్ ముందుకొచ్చారన్నారు. లడ్డూ పోటు, అన్నదాన భవనం, ఆర్చిలను ఫిబ్రవరి 10లోపు తేది ఖరారు చేసి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు రవీంద్రుడు, కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ, జయశ్రీ,వెంకటరమణమ్మ,కొండయ్య, ఎక్స్ అఫిషియో మెంబరు సోమశేఖర్‌గురుకుల్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో 'ఉత్తమ' ఉద్యోగులకు అవార్డులు



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న కార్వేటినగరం తహసీల్దారు రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 25: ఎన్నికల విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పలువురికి జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ షన్మోహన్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో బహూకరించారు. ఉత్తమ ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా నగరి ఈఆర్వో ఎస్.సుజన, ఉత్తమ ఏఈఆర్వోగా కార్వేటినగరం తహసీల్దార్ డి.రవికుమార్, ఎలక్షన్ డీటీ ఎస్ఎం విజయకృష్ణ (జీడీనెల్లూరు) అవార్డులు స్వీకరించారు. ఉత్తమ బూత్‌లెవల్ ఆఫీసర్లుగా పవన్‌కుమార్ (పెనుమూరు), డి. విజయ్ (వీఆర్వో, చిత్తూరు), తులసీరామన్ (పంచాయతీ కార్యదర్శి, ఐరాల), టి.హిమవతి (మహిళా పోలీసు, పలమనేరు), విజయ్‌కుమార్ (ఇంజినీరింగ్ అసిస్టెంట్, కుప్పం).. ఉత్తమ డేటాఎంట్రీ ఆపరేటర్లుగా బి.నిజాం (కుప్పం), ఎస్.కవిత (జీడీనెల్లూరు), ఎస్.షాదిక్ (చిత్తూరు), కె.కందస్వామి (గంగవరం), కె.భార్గవి (చిత్తూరు), ఎస్ఏ రెహమాన్ (పలమనేరు) అవార్డులు అందుకున్నారు. ఏడుగురు కొత్త యువ ఓటర్లకు ఎపిక్ కార్డులు పంపిణీ చేశారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డీఆర్వో రాజశేఖర్ వివిధ శాఖల సిబ్బందిచే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీసీఈవో ప్రభాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఇంకా జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ప్రసంగించగా, సీనియర్ న్యాయమూర్తి ఐ. కరుణకుమార్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు

తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.57 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,991 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,959 మంది తలనీలాలు సమర్పించారు.

అత్త, వదినపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

చిత్తూరు, జనవరి 25: చిత్తూరు నగరం శంకరయ్యగుంటలో బుధవారం రాత్రి అత్త హురాన్, వదిన సల్మాపై కత్తితో దాడి చేసి గాయపరిచిన నూర్‌ను రెండో పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉలసప్ప తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు దరఖాస్తు చేసుకోండి

వెదురుకుప్పం, జనవరి 25: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉండాలనుకునే ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ గురువారం తెలిపారు. ఇప్పటికే విజయవాడలో దరఖాస్తులను తీసుకుంటున్నారన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో వెనకబడ్డాం

చిత్తూరు రూరల్, జనవరి 25: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో వెనుకబడి ఉన్నామని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి వైద్యాధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 4,73,955 మంది ఆరోగ్యశ్రీ లబ్ధిదారులుంటే అందులో 3,08,544 ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయన్నారు. వీటిలోనూ కేవలం 2.23 లక్షల కార్డులు మాత్రమే పంపిణీ చేశామన్నారు. ఇది వైద్యాధికారుల పనితనానికి నిదర్శనమన్నారు. వచ్చిన ప్రతి కార్డును ఈ నెలఖరులోపు లబ్ధిదారులకు చేర్చి, ఆన్‌లైన్‌లో ఈకేవైసీ పూర్తి చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. మార్చి 3వ తేదీ నుంచి జరిగే పల్స్‌పోలియో కార్యక్రమానికి వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. డీఐవో రవిరాజు, ఆరోగ్యశ్రీ డీసీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో
అత్తాకోడళ్ల మృతి



మృతులు లీలారాణి, విజయఅను (ఫైల్ ఫొటోలు)

పిచ్చాటూరు, జనవరి 25 : రోడ్డు ప్రమాదంలో అత్తాకోడళ్లు మృతి చెందడం బాధిత కుటుంబంతో పాటు పిచ్చాటూరు వాసులను విషాదానికిలోనుచేసింది. పిచ్చాటూరుకు చెందిన బుక్‌స్టోర్ యజమాని ఉమాశంకర్ గుప్త అలియాస్ శంకర్‌శెట్టి భార్య ఎ.లీలారాణి,చిన్న కుమారుడు వినోద్, కోడలు విజయ అను,మనవళ్ళతో కలసి గురువారం ఉదయం కంచి మీనాక్షి గుడికి వెళ్లారు.దర్శనానంతరం అక్కడినుంచి బెంగళూరుకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలోని రాయవేలూరుకు 10 కి.మీ ముందు కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాదంలో లీలారాణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ మిగిలిన వారిని చికిత్స నిమిత్తం వేలూరు నరువ్వ ఆస్పత్రికి తరలించారు. విజయఅను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.శంకర్‌శెట్టి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుండగా వినోద్‌కు చేయి విరిగినట్లు సమాచారం. పిల్లలు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పిచ్చాటూరులో సుమారు 40 ఏళ్లుగా బుక్‌స్టోర్ నడుపుతూ స్థానికంగా అందరికీ చిరపరిచితుడైన శంకర్‌శెట్టి కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల స్థానిక వ్యాపార సంఘం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

భూ కబ్జాదారులపై ఉద్యమిద్దాం

బాధితులకు అండగా ఉందాం - అఖిలపక్షం తీర్మానం

తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఐదేళ్లుగా భూ కబ్జాలు ఎక్కువైపోయాయని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింతగా భూబకాసురులు పేట్రేగిపోతున్నారని అఖిలపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. బాధితులకు అండగా నిలవాలని తీర్మానం చేశారు. తిరుపతిలో భూకబ్జాలను అరికట్టేందుకు అఖిలపక్ష నాయకులతో కమిటీ ఏర్పాటైంది. జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ నేతృత్వంలో గురువారం ఓ హోటల్లో అఖిలపక్ష సమావేశంలో వివిధ పార్టీల నేతలు పాల్గొని ప్రసంగించారు. టీడీపీ నుంచి పాల్గొన్న ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ బాధితులు పోలీస్ స్టేషన్‌కో, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేస్తుంటే కూర్చుని సెటిల్ చేసుకోండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. పరిష్కారం చూపాల్సిన అధికారులు వైసీపీ నేతల తొత్తులుగా మారిపోయారని పేర్కొన్నారు. భూబాధితులకు



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఊకా విజయ్‌కుమార్

అఖిలపక్షం అండగా ఉంటుందని చెప్పారు. కబ్జాదారులకు అం డగా ఉండే అధికారులు జైలుకెళ్లే ప్రమాదం ఉందని గ్రహించాలన్నారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ తిరుపతిలో వంద అంకణాలు కొనుగోలు చేసుకున్న వారు అక్కడే కాపలా కాసే పరిస్థితి వస్తోందన్నారు. భూమన అభినయ రెడ్డి కార్పొరేటర్లకు టార్గెట్ ఇచ్చినట్టుగా తెలుస్తోందని, ఎవరు ఎక్కువగా భూకబ్జాలు చేస్తే వారికి మార్కులు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా భూ కబ్జాలు ఆగడంలేదన్నారు. కబ్జాదారులను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి ఉపేక్షించరని, వారి పేర్లు చెప్పుకుని దందాలు చేసే వారిపై అఖిలపక్షం చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నేతలు పొనగంటి భాస్కర్, మునిసుబ్రమణ్యం, టీడీపీ నేత చినబాబు, జనసేన నేతలు రాజారెడ్డి, సుభాషిణి, నాగరాజు రాయల్, ఆప్ నేత నీరుగట్టు నగేష్, బాధితులు సంపూర్ణమ్మ, దొమ్మరాజు లక్ష్మమ్మ, సుమతి, విజయలక్ష్మి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గురుమూర్తికి ఆదిలోనే అసమ్మతి సెగ

● వైసీపీ మండల కన్వీనర్ రాకతో సమావేశాన్ని బహిష్కరించిన ఒక వర్గం ● పార్టీ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ/తిరుపతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి సత్యవేడు వైసీపీ ఇంచార్జిగా నియోజకవర్గంలో అడుగుపెట్టారో లేదో అసమ్మతి సెగ తాకింది. ఇటీవల సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిగా గురుమూర్తిని వైసీపీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే.రానున్న ఎన్నికల్లో సత్యవేడు నుంచీ పోటీ చేయనున్న నేపథ్యంలో పర్యటనలకు ఎంపీ గురుమూర్తి శ్రీకారం చుట్టారు. సత్యవేడు సెగ్మెంట్ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన శ్రేణులనూ ఈనెల 27న తిరుపతికి ఆహ్వానించి మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.మంత్రి ద్వారా తనకు సహకరించి గెలుపుకోసం పనిచేయాలంటూ శ్రేణులకు దిశా నిర్దేశం చేయించేలా కార్యక్రమం రూపొందించుకున్నారు. అందులో భాగంగా మండలాల వారీగా ఆహ్వానించే పనిలో భాగంగా గురువారం బీఎన్ కండ్రిగకు వెళ్లారు. అక్కడ



అసమ్మతి నాయకులను సముదాయిస్తున్న ఎంపీ అనుచరులు

సమావేశానికి మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి హాజరు కాలేదు. ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరుడైన ఆయన రాకపోవడంతో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం చొరవ తీసుకుని ఎంపీకి భారీసంఖ్యలో స్వాగతం పలికారు. అయితే సమావేశం ప్రారంభమయ్యే సమయంలో మండల కన్వీనర్‌ను కూడా ఆహ్వానిస్తే బాగుంటుందని కొందరు సూచించడంతో ఎంపీ కన్వీనర్ ఇంటికి వెళ్ళి వెంట బెట్టుకుని తిరిగివచ్చారు. దీంతో అప్పటి వరకూ ఎంపీని నెత్తిన పెట్టుకున్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఒక్కసారిగా రివర్స్ య్యారు. కన్వీనర్ సమావేశానికి రాకపోగా తామంతా ముందుండి స్వాగత సత్కారాలు చేస్తే సమావేశానికి రాని కన్వీనర్ ఇంటికి ఎంపీ వెళ్ళి పిల్చుకురావడమేమిటని మండిపడ్డారు.సింగిల్‌విండో ఛైర్మన్ హరినాథరెడ్డి, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథం, గురవయ్యలతో పాటుగా పదుల సంఖ్యలో నాయకులు, వారి అనుచరులు అక్కడినుంచి వెళ్ళిపోయారు. ఎంపీ అనుచరులు వచ్చి ఎంత సముదాయించినా సమావేశానికి రాకపోవడంతో అరగంట తరువాత కన్వీనర్‌తో కలసి వున్న కొద్దిమందితోనే ఎంపీ సమావేశం నిర్వహించి తిరుపతి మీటింగుకు రావాలని అభ్యర్థించి వెళ్ళిపోయారు.ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణా రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీరెడ్డి, వైసీపీ జిల్లా కార్మిక విభాగ అధ్యక్షుడు బీరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

మండల పరిషత్ మీటింగ్ హాల్లో సమావేశమా?

ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే వేదిక కావాల్సిన బీఎన్ కండ్రిగ మండల పరిషత్ కార్యాలయ మీటింగు హాలు గురువారం వైసీపీ కార్యకర్తల సమావేశానికి వేదికగా మారింది.ఎంపీ గురుమూర్తి అక్కడ పార్టీ అభివృద్ధి, ఐక్యత గురించి ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయంలో అధికార పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం, ఎంపీడీవో సాయి లహరి కూడా ఈ సమావేశంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

ఎన్‌ఆర్‌ఐ సలహాదారుకు పదవీ కాలం పొడిగింపు



జ్ఞానేంద్రరెడ్డి

వెదురుకుప్పం, జనవరి 25: ఏపీ ప్రభుత్వ ప్రవాసాంధ్రుల (ఎన్‌ఆర్‌ఐ) సలహాదారు జ్ఞానేంద్రరెడ్డికి మరో ఏడాది పాటు పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెనుమూరు మండలం గుంటిపల్లికి చెందిన చిత్తూరు ఈయన పదవీ కాలం ఫిబ్రవరి 9వ తేదీకి ముగియుంది. ఈ క్రమంలో ఆ తేదీ నుంచి పదవీ కాలం పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

30న ఆర్టీసీ కార్గోలో అన్ డెలివరీ పార్సిల్స్ వేలం

చిత్తూరు రూరల్, జనవరి 25: చిత్తూరులోని ఆర్టీసీ కార్గో పాయింట్‌లో గత సంవత్సరం సెప్టెంబరు 10 వరకు ఉన్న అన్ డెలివరీ పార్శిల్స్‌ను ఈ నెల 30వ తేదీన వేలం వేయనున్నట్లు కార్గో ఏటీఎం సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 16 వస్తువులను వేలం పాటలో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని, పాడుకున్న వస్తువులకు అప్పటికప్పుడే నగదు చెల్లించి తీసుకోవచ్చునన్నారు. 30న ఉదయం 9 గంటలకు వేలం పాట మొదలవుతుందని ఆయన తెలిపారు.









వేడుకగా రామకృష్ణ తీర్థ ముక్కోటి

తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శేషాచల అడవుల్లోని రామకృష్ణ తీర్థ ముక్కోటిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా పుష్యమాసం పౌర్ణమినాడు రామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. రామకృష్ణ మహర్షి తపోబలంతో ఈ పుణ్యతీర్థాన్ని సృష్టించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్చారణ చేసుకుంటూ ఊరేగింపుగా ఉదయం 10 గంటలకు తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న రామచంద్రమూర్తి, కృష్ణభగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం తదితర సుంగధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు పాపవినాశనం డ్యాం వద్ద అన్నప్రసాదాలు అందజేశారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.

రా..కదలిరా.. సభకు తరలిరండి

● రేపు పీలేరులో జరిగే మహాసభను విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణుల పిలుపు ● పాల్గొననున్న పార్టీ అధినేత చంద్రబాబు



మదనపల్లెలో మాట్లాడుతున్న శ్రీరామ్‌చినబాబు

నిమ్మనపల్లెలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్



మదనపల్లెటౌన్/నిమ్మనపల్లి, జనవరి 25: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఈ నెల 27న పీలేరులో జరుగనున్న రా..కదలిరా..మహాసభను విజయవతం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండలంలోని తవలం పంచాయతి నల్లంవారిపల్లిలో కార్యక ర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనతో ప్రజలకు ఒరిగిందేమిలేదని ఇచ్చిన హామీల ను తుంగలో తొక్కారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు తగిన గుణపా ఠం చెప్పాలన్నారు. అలాగే శనివారం పీలేరులో జరిగే టీడీపీ మహాసభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు హాజరై సభను విజ యవతం చేయాలన్నారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అబ్జర్వర్ చంద్రశేఖర్, నాయకులు వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, భవాని ప్రసాద్, మునిరత్న, లక్షన్న, మల్లప్ప, మల్లికార్జున, చినబాబు శంకర, మురళి, రాజశేఖర్, విజయ్, గోపి, కేశవ, చంద్ర, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. పీలేరులో ఈనెల27న నిర్వహించనున్న రా...కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గ అబ్జర్వర్ చంద్రశేఖర్, ముఖ్యనాయకులతో సమావేశమై. చంద్రబాబు పాల్గొనే ఈ బహిరంగ సభకు మదనపల్లె నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఏ మస్తాన్, దొరస్వామి నాయుడు, పఠాన్ ఖాదర్‌ఖాన్, శ్రీరాములు, శంకర పాల్గొన్నారు. కాగా టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి మండల వ్యాప్తంగా పర్యటించి రా..కదలిరా కార్యక్రమానికి పెద్దసంఖ్యలో టీడీపీ కార్యకర్త లు తరలిరావాలని పిలుపునిచ్చారు. దీంతో పాటు పీలేరుకు వెళ్లి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో చర్చిం చి, ఏర్పాట్లు పరిశీలించారు.

ములకలచెరువులో: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్వర్యంలో పీలేరులో ఈ నెల 27వతేదీన జరిగే భారీ బహిరంగ సభకు తరలిరావాలని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు. అభిమానులు, జనసేన పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కాగా పీలేరు లో ఈ నెల 27న పీలేరులో రా..కదిలిరా భారీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలనిపార్టీ పరిశీలకుడు మోహ రుశెట్టి చంద్రశే ఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పిలుపునిచ్చారు. పాత ములకలచెరువులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అధ్వర్యంలో జరిగే సమావేశానికి మండలం నుంచి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి వెంక టస్వామి, నేతలు కేవీ రమణ, చెన్నకిష్టా, కేశవులు, నాయకులు భజంత్రి రామాంజులు, హరి, జహీర్, శివన్న, శ్రీనివాసులు, రసూల్, బషీర్, గాండ్ల రెడ్డెప్ప పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్వర్యంలో ఈ నెల 27న పీలేరులో జరుగనున్న రా..కదిలిరా. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి బుక్కే మనోహర్ నాయక్, తంబళ్లపల్లె బీసీ నాయకుడు బిక్కా మధుకర పిలుపునిచ్చారు. పెద్దమండ్యం మండలంలో గ్రామ, మండల, నియోజవర్గం, జిల్లా నాయకులు, నేతలు తరలిరావాలనికోరారు. కార్యక్రమంలో నటరాజ్ నాయక్, సిద్దవరం ప్రసాద్, పెద్దన్న, వేమయ్య, మేకల చలపతి, మస్తాన్‌ఖాన్, రమణ, ప్రభాకరరెడ్డి, ఓబులేసు, రామాంజులు నాయుడు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: పీలేరులో ఈ నెల 27న జరిగే రా..కదలిరా సభను విజయవంతం చేద్దామని టీడీపీ మండల పరిశీలకుడు రెడ్డిశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తంబళ్లపల్లెలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకు లు, కార్యకర్తలు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, అన్ని విబాగాల నాయకులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, వీరాంజినేయులు, పీర్లమాబు టీడీపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురబలకోటలో: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న రా..కదిలిరా సభను విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న పీలేరులో నిర్వహించే సభకు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పాల్గొంటారన్నారు. నియోజకవర్గం నుంచి యువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట పార్ల మెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, పార్ల మెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి సదాశివ, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, వెంకటరమణారెడ్డి, రామచంద్ర, మోహన్‌రెడ్డి, దామోధర్‌రెడ్డి, మునింద్ర, తెట్టు ఉపసర్పంచ్ బి.భాస్కర్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: పీలేరులో ఈనెల 27నజరగనున్న రా.. కదలి రా.. సభను విజయవంతం చేయాలని పీలేరు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ సూరా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సమీక్షించారు. టీడీపీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న మహాసభకు ప్రతి గ్రామం నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అవినీతి వైసీపీ ప్రభుత్వం పనైపోయిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభంజనం ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, వల్లిగట్ల రమణ, మురళి,డిష్ బ్రదర్స్, కువైట్ సయ్యద్‌బాషా, తెలుగు యువత చాను, తుంబూరి వెంకటరమణ, ఆనంద్, హనీఫ్, సైదు, గాంధీపేట రెడ్డి, స్వర్ణలత, జావీద్, గంగులప్ప, రెడ్డెప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: రా...కదలిరా... సభను విజయవంతం చేయాలని మండల అబ్జర్వర్ నాగభూషణ నాయుడు పిలుపునిచ్చారు. బి.కొత్తకోటలోని టీడీపీ కార్యాలయంలో మండల నాయకులతో కలసి ఆయన సభకు పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, అభిమానులు తరలి వచ్చే విధంగా కార్యకర్తలందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడుం శ్రీనివాసులు, బంగారు వెంకట్రమణ, కనకంటి ప్రసాద్, షమీవుల్లా, దేవుడు నాగరాజు, చాకనా రాజా, నాసీర్ తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువులో మాట్లాడుతున్న పరిశీలకుడు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా



కురబలకోటలో మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్



వాల్మీకిపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న అబ్జర్వర్ సుధాకర్‌రెడ్డి



తంబళ్లపల్లెలో రా..కదలిరా కార్యక్రమంపై మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

యువత ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

పీలేరు, జనవరి 25: యువత ప్రతి ఒక్క రూ ఓటరుగా తప్పకుండా నమోదు చేసు కోవాలని పీలేరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గోపాలకృష్ణ పేర్కొన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురు వారం పీలేరులోని ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌జీవోలు ఘనంగా నిర్వహించారు. పీలేరు తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి గోపాలకృష్ణ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని వివరించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజే శారు. ఓటరు నమోదులో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేసిన పలువురు ఉద్యోగులకు ప్రత్యేక బహుమతులు అందించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కొత్తగా ఓటరు కార్డులు పొందిన నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అంతకు మునుపు రెవెన్యూ అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ఎస్వీ చలపతి, తహసీల్దారు ధనంజయులు, ఎంపీడీవో డాక్టర్ మురళీకృ ష్ణారెడ్డి, డీటీలు విజయ్, సుబ్రహ్మణ్యం, ఆర్ఐ చాణక్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నటరాజన్, పాల్గొన్నారు.



మదనపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్/టౌన్: జాతీయ ఓటర్ల దినోత్స వంతో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్ ఆధ్యక్షతన ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పటటణంలోని సీనియర్ ఓటర్లను దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మా నించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర కళాశాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈ కళాశాల ప్రిన్సిపాల్ గోపతి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌చాంద్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల,డీటీలు బావజాన్, బాబ్జీ, ఆర్ఐ రెడెప్ప, వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాదు, సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు. ఓటుహక్కును ప్రతి పౌరుడు బాధ్యతగా వినియోగించుకోవాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు విలువపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు వనజ, జ్యోతి, సూర్యశేఖర్, కుల్లాయప్ప పాల్గొన్నా రు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భం గా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రజలు తమ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని ఈఆర్వో రాఘవేంద్ర అన్నారు. గురువారం తంబళ్లపల్లెలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లెలో తహసీల్దారు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు సీనియర్ సిటిజన్స్‌ను శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, విద్యార్థులు, ఓటర్లు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో జాతీయ ఓటర్ల దినోత్సవం సంద ర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారదా పాఠశాల విద్యార్థులు, అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రదర్శన చేపట్టి అనంతనం బస్టాండు సర్కిల్‌లో మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల కరెస్పాండెంట్ సనత్‌కుమార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఖాజాబీ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గుర్రంకొండ జూనియర్ కాలేజీ నుంచి బస్టాండు వరకు ర్యాలీని నిర్వహించి అనంతరం మానవహారం గా నిలిచి ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జమీర్, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: ప్రజాస్వామ్యంలో ఓటుతోనే ఉజ్వల భవిష్యత్ అని పీటీఎం తహసీల్దార్ విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఓటు విశిష్టతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటర్లతో తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక పీటీఎంకు చెందిన సీనియర్ సిటిజన్స్ తోట సిద్దప్ప, పూలశెట్టి ఆంజప్పను స్థానిక తహసీల్దార్, ఎంఈవో లు వారికి పూల మాలలు వేసి, శాలువ కప్పి సన్మానించారు. వీఆర్వోలు, పోలీసులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఎంపీడీవో నారాయణస్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, డీటీ, జూనియన్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ ఓటర్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.అలాగే గ్రామాల్లోని నిరక్షరాస్యులకు, విద్యావంతులు ఓటుపై అవగాహన కల్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి సత్యనారాయణ, అధ్యాపకులు, నాగరాజు, రవీంద్ర, భవాని, చిరంజీవి, వేదవతి, శేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బికొత్తకోట నగర పంచాయతీలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల చే ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రఫిక్ అహ్మద్, నగర పంచాయతీ కమిషనర్ మనోహర్ లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బలమైన ఆయుధమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ , విఆర్వోలు, బిఎల్వోలు పాల్గొన్నారు.

పట్టాభి రామాలయంలో అన్నీ సమస్యలే..

వాల్మీకిపురం, జనవరి 25: వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో అన్నీ సమస్యలేనని టీడీపీ నాయకులు ఆరోపించారు. గురువారం స్థానిక ఆలయానికి వచ్చిన ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులులను కలిసి ఆలయ సవస్యలను విన్నవించారు. స్థానికంగా ఆలయంలో కనీస వసతుల కల్పన ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు గాంధీపేట రమణ, చంద్రమౌళి, వల్లిగట్ల వెంకటరమణ, ఆనంద్ పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్‌గా శేషాచలపతి

మదనపల్లె టౌన్, జనవరి 25: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడుగా మదనపల్లె మండలం సవరంవారిపల్లెకు చెందిన జన్నే శేషాచలపతినాయుడు నియమితులయ్యారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ శంకరనారాయణను నియమించారు. ఆయనతో పాటు రాయలసీమ నుంచి చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న శేషాచలపతినాయుడు, డాక్టర్ ఎన్.మారేశ్వరరావు, కుందుర్తి గురువాచారిలను సభ్యులుగా నియమించారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఈ- ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

అర్.ఓ.సి.నెం. 1394/E1/2020 తేది: 25-01-2024

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకుగాను ఈ- ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించబడమైనవి.

వ. నెం.	Funds	Tender ID Nos.	పనుల సంఖ్య	పనుల అంచనా మొత్తము (ECV)
1.	General Funds	713076,713083,713095,713103, 713149,713190,713207,713213, 713351,713355,713361,713374, 713378,713390,713398,713403	16	78.64 లక్షలు
2	Pedalandiriki Illu Funds	713333,713345,713364,713371	4	33.52 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరములు కొరకు వారి e procurement market place నందు చూడవలెను మరియు ఆఫీసు పని వేళల యందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదలుతేది : 25-01-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరితేది : 09-02-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 09-02-2024 ఉ॥11.15గం॥లకు

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

సం/- **కమీషనర్,** మదనపల్లె పురపాలకసంఘం

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

పెద్దతిప్పసముద్రం జనవరి 25 :మండలంలోని టి.సదుంకు చెందిన టీడీపీ కార్యకర్త చింతమాను శ్రీనివాసులుకు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ కాలు పాక్షికంగా దెబ్బతింది. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు పట్టా చంద్రమోహన్‌రెడ్డి, అనంతాపురం సుబ్బిరెడ్డి జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం ఆయన సాయమందించారు. సుధాకర్‌రెడ్డి, బీవీ రెడ్డి, సుబ్బిరెడ్డి, మాజీ సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, ఆంజనేయ రెడ్డి, బి.శంకర్‌రెడ్డి, బాస్కర్, మైనారిటీ నేత ఫజుల్లాతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు జయచంద్రారెడ్డి పరామర్శ

పెద్దతిప్పసముద్రం జనవరి 25 :మండలంలోని రామాపురంకు చెందిన టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బీవీరెడ్డిని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి గురువారం పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఆనారోగ్యానికి గురై బెంగళూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది బీవీ రెడ్డిఇటీవలే ఇంటికి చేరుకున్నాడు.

జనసేనలోకి భారీగా యువత చేరిక

మదనపల్లె, జనవరి 25: మదనపల్లె నియోజకవర్గంలోని పట్టణ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల నుంచి భారీగా యువత జనసేనలో చేరారని పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు తెలిపారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లపై శిక్షణ

మదనపల్లె, జనవరి 25: మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని సచివాలయాల్లో ఇళ్లు, ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ టెక్నికల్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 27వతేదీ నుంచి ఆయా సచివాలయాల్లో లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందులోభాగంగా మూడు రోజుల పాటు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ పూతలపట్టు రాజు..వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సాంకేతిక సిబ్బందికి విడతల వారీగా శిక్షణతోపాటు అవగాహన కల్పిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా రామకృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్. జనవరి 25: మదనపల్లెకు చెందిన సింగం రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ పుంగనూరు కన్వీనర్‌గా నియమితులయ్యారు. గురువారం రాయచోటిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో రాష్ట్రమీడియా అధ్యక్షుడు తులసిరెడ్డి జిల్లా అధ్యక్షుడు అల్లాబక్షు లు రామకృష్ణారెడ్డిని కన్వీనర్‌గా నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, మదనపల్లె నియోజకవర్గ నాయకులు ఎస్‌రెడ్డిసాహెబ్, మదనపల్లె కన్వీనర్ లీలావతి, మహబూబ్‌పీర్, సురేంద్ర రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జనవరి 25: పట్టణంలోని పట్టాభిరామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా కమనీయంగా జరిగింది. సాయంత్రం తిరుచ్చిలో సీతా లక్ష్మణ సమేత పట్టాభిరాములను పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

కలకడ, జనవరి 25:దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పీలేరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని గంగాపురంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, లతీఫ్‌ఖాన్, మనోహర్ గౌడ్, ఆంజినేయులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని పవిత్ర (ఫైల్)

కలికిరి, జనవరి 25: స్థానిక హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న జి.పవిత్ర (17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వాల్మీకిపురం సీఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం ఈదువారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమార్తె జి.పవిత్ర కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు చెందిన హాస్టల్ గదిలో వుంటూ చదువు కొనసాగిస్తోంది. ఇటీవల జరిగిన ప్రాక్టికల్స్ పరీల్లో మూడు సబ్జెక్టులు తప్పింది. దీంతో తన తోటి విద్యార్థినులతో బుధవారం రాత్రి పొద్దుపోయే వరకూ తాను ఫెయిల్ అయిన విషయంపై తీవ్ర మనస్తాపం వ్యక్తం చేసిందని అయితే సమాధానపడని పవిత్ర అదే రోజు రాత్రి విరక్తి చెంది గదిలోని సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకున్నట్లు సీఐ తెలిపారు. గురువారం ఉదయం పవిత్ర ఎంతకీ గది తలుపు తెరవకపోవడంతో తోటి విద్యార్థినులు అనుమానంతో బలవంతంగా తలుపులు తెరిచి లోనికెళ్లారు. గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు పవిత్ర ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే పవిత్ర మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పవిత్ర తల్లిదండ్రులు కలికిరి చేరుకుని ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీఐ సురేష్‌కుమార్ దర్యాప్తు బాధ్యతను వాల్మీకిపురం ఎస్ఐ వి.నాగేశ్వర రావుకు అప్పగించారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్య గొంతు కోసిన భర్త

నిమ్మనపల్లి, జనవరి 25: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్య గొంతు కోశాడు ఓ కిరాతక భర్త. పోలీసుల కథనం మేరకు నిమ్మనపల్లి మండలం వెంగంవారిపల్లి పంచాయతి చిన్నల్లవారిపల్లికి చెందిన ఉమామహేశ్వరెడ్డికి 16ఏళ్ల క్రితం బత్తుల అమృతతో వివాహం జరిగింది. కొంత కాలంగా ఉమామహేశ్వరెడ్డి తాగుడుకు బానిసయ్యాడు. దీంతో ప్రతి రోజు కుటుంబంలో గొడవలు జరిగేవి. దీంతో భార్య అమృత త న పుట్టిటి వెళ్లిపోయింది. కాగా కొద్ది రోజుల క్రితం పెద్ద మనుషుల ద్వారా భార్య అమృతను ఇంటికి పిలుచుకొచ్చాడన్నారు. అయితే గురువారం అమృత ఆవు వద్ద పాలు పితుకుతుండగా మహేశ్వర్ రెడ్డి తనకు తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కత్తితో ఆమె గొంతు కోసాడు. దీంతో అమృత అక్కడి కక్కడే కుప్పకూలి పోయింది, అక్కడ వున్న గ్రామస్థులు వెంటనే మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు, అక్కడ ఆమెకు 32కుట్లు పడినట్లు తెలిపారు. దీంతో మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్‌బాబు తెలిపారు.

వృద్ధురాలిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మదనపల్లె టౌన్, జనవరి 25: మదనపల్లె ఆర్టీసీ బస్టాండు సమీపంలో భిక్షాటన చేస్తున్న ఫాతీమా(70) అవూ వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ప్రాణాపాయ స్థితిలోఉంది. గురువారం ఉదయం సీటీఎం రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోకి వెళ్లేందుకు డ్రైవర్ అబ్దుల్ రహీం ఆర్టీసీ బస్సును తీసుకొచ్చాడు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న వృద్ధురాలు ఫాతీమాని గమనించని డ్రైవర్ అలాగే బస్సును ముందుకు పోనిచ్చడంతో బస్సు చక్రాల కింద పడిపోయిన ఆమె కుడి చేయి, కాలు రెండు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్థానికులు ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చేర్చగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జనవరి 25: వ్యక్తిపై దాడి చేసి గాయపడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. గురువారం బోయకొండ సమీపంలో పేకాట ఆడుతూ బండ్లపై గ్రామానికి చెందిన గణేష్‌పై తన సహచరులు అయిన నిమ్మనపల్లికి చెందిన మునిరాజ. సింహ, సోము, ప్రకాష్‌లు కట్టెలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గణేష్‌ను మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో డ్రైవరు మృతి

కలికిరి, జనవరి 25: గుండ్లూరు కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాల కోసం జోజర్‌తో భూమిని చదును చేస్తుండగా పైన వున్న 11 కేవీ లైను విద్యుత్ తీగలు తగిలి డ్రైవరు కల్యాణ్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రొద్దుటూరు ప్రాంతంలోని ఖాజీపేట మండలానికి చెందిన డ్రైవరు కల్యాణ్ విద్యుదాఘాతానికి మృతి చెందాడని విద్యుత్ శాఖ ఏఈఈ ముజిబుర్ రహ్మాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ లైను కింద ఎత్తులో ఉన్న మట్టిని చదును చేయడంతో విద్యుత్ వైర్లు తగిలాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒప్పందం ఉల్లంఘించి..ఆరోపణలు చేయడం తగదు


● మండీ యజమానులపై మినీ లారీ అసోసియేషన్ ధ్వజం



అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యులు

మదనపల్లె టౌన్, జనవరి 25: గత మూడున్నర సంవత్సరాలుగా తాము మినీ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టమోటా మార్కెట్ వెలుపల స్థానికేతర మినీ లారీల నుంచి రూ.100 వసూలు చేస్తున్నాం. దీన్ని రాజకీయం చేయడానికి టమోటా మండీ యజమానులు సొంతంగా అసోసియేషన్ పెట్టుకుని, మాతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి మాపైనే దౌర్జన్యం చేయడం తగదని మదనపల్లె మినీ లారీ అసోసియేషన్ సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉపాధ్యక్షుడు రెడ్డిప్రసాద్ మాట్లాడుతూ 2022లో ఇదే వివాదం మొదలైతే అప్పటి మార్కెట్ కమిటీ సెక్రటరి, డైరెక్టర్ సమక్షంలో చర్చలు జరిగాయని దీని ప్రకారం మండీ యజమానులు, మినీ లారీ అసోసియేషన్ మధ్య కొన్ని నిబంధనలతో మండీ యజమానుల లారీలను తప్పించి, స్థానికేతర లారీల వద్ద రూ.100 చొప్పున కార్పస్‌ఫండ్ వసూలు చేసి లారీ డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమానికి ఉపయోగిస్తున్నామన్నారు. సుమారు 1000 కుంటుబా లు రవాణా రంగంపై ఆధారపడి బతుకుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ మార్కె ట్‌లోకి వెళ్లినా తమ లారీలు కార్పస్ ఫండ్ చెల్లిస్తామని ఇది అన్ని మార్కెట్లలో పరి పాటిగా ఉందన్నారు. నిన్న జరిగిన వివాదమై మదనపల్లె డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మండీ యజమానులకే మార్కెట్ కమిటీ, వారికే వత్తాసు పలుకుతున్నారని ఈ విషయమై మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సంయుక్త కార్యదర్శి అనిల్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణను అడ్డుకుని న్యాయం చేయండి



స్థలం వద్ద నిరసన తెలుపుతున్న అనాథపిల్లలతో బహుజన సేన

మదనపల్లె అర్బన్, జనవరి 25: ప్రభుత్వం చైతన్య సేవాసంస్థకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణ చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, దానిని సర్వే చేయించి న్యాయం చేయాలని చైతన్యసేవా సంస్థ ఆశ్రమ నిర్వాహకులు కోరారు. ఆమేరకు సంస్థ నిర్వాహకుడు ఎంపీ ఆనందన్, బహుజన సేన శ్రీచందు, సీపీఐ మురళితోపాటు పలు ప్రజాసంఘాలు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ఆశ్రమ పిల్లలతో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ సర్వే కోసం మండల సర్వే సుబ్రహ్మణ్యంను స్థలం వద్దకు పంపారు. స్థలంలో సర్వే చేస్తుండగా రైతు శ్రీనివాసులు తమకు హక్కు ఉందని సర్వేను అడ్డుకున్నారు. సర్వేయర్ రైతు రికార్డులను పరిశీలించి ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించిందని తేల్చారు. 2014లో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించినట్లు రెవెన్యూ ఉన్నతాధికారులు పేర్కొన్నారని చెప్పారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు, కోన భాస్కర, నిర్వాహకులు, ఆనందన్, కృష్ణచరణ్, కవిత, ఆశ్రమ పిల్లలు పాల్గొన్నారు.

బి కొత్తకోట రూట్‌లో గిఫ్ట్ స్కీమ్

మదనపల్లె అర్బన్, జనవరి 25: బికొత్తకోట మార్గంలో ప్రయాణికుల కోసం గిఫ్ట్‌స్కీమ్‌ను అందజేస్తున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. జనవరి 31 తేదీన ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీడిప్ తీసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందిన ప్రయాణికులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మదనపల్లె- బికొత్తకోట రూట్‌లో ప్రయాణించే వారు టికెట్ వెనుక పేరు, ఊరుపేరు, ఫోన్‌నెంబరు రాసి ఆర్టీసీ బస్సులోని బాక్స్‌లో వేయాలన్నారు. ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.